క్లుప్తంగా

శివాలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని ఖానాపురం పారిశ్రామిక ప్రాంతం శ్రీ విశాలాక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అన్నదానం చేశారు. ప్రతి సోమవారం సుమారు 1,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామని దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, కార్పొరేటర్ నాగండ్ల కోటి తెలిపారు.

శిథిల భవనం కూల్చివేతపై మీనమేషాలు



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన దేవాదాయ శాఖ భవనం

ఖమ్మంమయూరిసెంటర్: శిథిలావస్థకు చేరిన భవనాలతో ప్రమాదం పొంచి ఉందంటూ తొలగించేందుకు కేఎంసీ అధికారులు ఉపక్రమించారు. ఇందులో భాగంగా ఈ నెల 17న పలు ప్రాంతాల్లో ప్రైవేట్ భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేయించారు. అలాగే, నిజాంపేట మోమినాన్ బజార్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం పక్కనే దేవాదాయశాఖకు చెందిన శిథిల భవనాన్ని కూలిచ్చవేసేందుకు వెళ్లగా విద్యుత్ మీటర్ల ద్వారా సరఫరా ఉండటంతో వెంటనే విద్యుత్ మీటర్లు, వైర్లను తీయించాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించి వచ్చేశారు. అయినప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు ఎలాంటి పనులు చేపట్టలేదు. భవనం తొలగింపులో ఇటు కేఎంసీ, అటు దేవాదాయ శాఖ అధికారుల తీరుతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భవనం కూలి ఏదైనా ప్రమాదం జరగకముందే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

మురుగు పోయే మార్గమేది ?



డ్రెయినేజీ లేక ఖాళీస్థలంలోకి చేరుతున్న మురుగునీరు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు సరిగ్గా లేక మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమీపాన ఎన్నెస్పీ క్యాంపులో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్ ఎదురుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ డ్రెయినేజీ సరిగ్గా లేక మురుగు నీరు రోడ్డుపైకి చేరి మళ్లీ ఖాళీ స్థలంలోకి వెళ్తోంది. ఈ విషయం తెలిసినా కేఎంసీ పారిశుద్ధ్య విభాగం ఉద్యోగులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	డిమాంట్ కాలనీ–2
వినోద	ఆయ్
సాయిరాం	తంగలాన్
ఆదిత్య	మారుతినగర్ సుబ్రమ్మణ్యం
శ్రీనివాస	డబుల్ ఇస్మార్ట్
సీఎస్‌సినీగెలాక్సీ	డబుల్ ఇస్మార్ట్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	4
వంకాయ	30		20
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	20		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	160		20
బీర	36	తోటకూర	3
దొండ	30		20
పొట్లకాయ	30	గోంగూర	5
చిక్కుడు	56		10
గోరుచిక్కుడు	36	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	40		40
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	50		20
బీన్స్	66	-ఖమ్మం వ్యవసాయం	

మున్సిపాలిటీగా పెదతండా?

- ఇప్పటికే వివరాలతో నివేదిక అడిగిన ఉన్నతాధికారులు
- 10 నుంచి 12 గ్రామాలతో ఏర్పాటుకు అవకాశం
- ఆదిలోనే వ్యతిరేకిస్తున్న కొందరు నాయకులు?
- ఆసక్తిగా పరిశీలిస్తున్న ప్రజలు, పార్టీల నాయకులు



పెదతండాలోని ప్రధాన సెంటర్

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోనే అతిపెద్ద గ్రామపంచాయతీ అయిన పెదతండా కేంద్రంగా త్వరలో మున్సిపాలిటీ ఏర్పాటు కానుందా? అనే సందేహాలకు ఔననే సమాధానాలు వస్తున్నాయి. అందుకోసం ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తున్నట్లు అర్థమవుతోంది. ఖమ్మం నగరానికి అతి సమీపాన ఉండి ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పెదతండాను మున్సిపాలిటీగా మారిస్తేనే మోక్షం కలుగుతుందనే అభిప్రాయంతో ప్రభుత్వం ఆదిశగా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెదతండాతో పాటు గొల్లగూడెం, పోలేపల్లి, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి, ముత్తగూడెం, ఏదులాపురం.. ఆపై పరిస్థితులు, డిమాండ్ ఆధారంగా బారుగూడెం, ఆరెంపులను కలుపుతూ మున్సిపాలిటీ చేయాలని ప్రభుత్వ ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా గ్రామాల జనాభా, విస్తీర్ణం, ప్రత్యేకతలతో నివేదిక పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది.

ఖమ్మంకు కూతవేటు దూరంలో ఉన్నా..

అయితే ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న మేజర్ పంచాయతీ అయిన పెదతండా అన్ని రంగాల్లో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నదనేది తెలిసిందే. కనీసం సైడ్ కాల్వల్లో మురుగునీరు, చెత్తాచెదారం కూడా సరిగ్గా తీయరు. గ్రామపంచాయతీకి వచ్చే నిధులు వస్తున్నప్పటికీ ఇంతకాలం అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉందనే చెప్పొచ్చు. ఇదే సాకుతో గతంలో పెదతండాతో పాటు ఇప్పుడు మున్సిపాలిటీలో కలుస్తాయనుకుంటున్న గుర్రాలపాడు, ఏదులాపురం, వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాలను ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో ఈ గ్రామాల అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయినా అభివృద్ధి మాట దేవుడెరుగు కనీసం డ్రెయినేజీల్లో చెత్త తీసిన నాథుడే లేడు. కార్పొరేషన్‌లో అంతర్భాగంగా ఉన్నప్పుడు ప్రజలు గుక్కెడు నీటి కోసం తహతహలాడారు. ఆయా గ్రామాల ప్రజలు, నాయకుల డిమాండ్‌తో కేఎంసీ నుంచి విడదీసి మళ్లీ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది.

మున్సిపాలిటీతో అభివృద్ధి సాధ్యమా?

అయితే ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనమయ్యే గ్రామాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. మున్సిపాలిటీలో కలుపుతారనే 10 నుంచి 12 గ్రామాల్లో మొత్తం జనాభా సుమారు 56 వేలుగా ఉంది. మున్సిపాలిటీలో నిధులు ఎక్కువగా వస్తాయని, దాంతో అభివృద్ధి వేగం పుంజుకుంటుందని అంటున్నారు. కానీ, అంతే వేగంగా పన్నుల భారం కూడా పడుతుంది. అయితే గతంలో గ్రామ పంచాయతీలుగా ఉండటంతో ఏసమస్య వచ్చినా చెప్పుకోవడానికి గ్రామసర్పంచ్ అందుబాటులో ఉండేవారు. అతనిని నిలదీసైనా సమస్యలు పరిష్కరించుకునే వీలుండేది. అదే మున్సిపాలిటీగా మారితే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి? వారు అందుబాటులో ఉంటారా? లేదా? అని సవాలక్ష ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రతిపాదనలపై కొందరి వ్యతిరేకత

మున్సిపాలిటీ చేస్తే అందులో తమ గ్రామాలు కలిస్తే ఎలా? అని కొన్ని గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. బయటకు బాహాటంగా తమ మనసులోని మాటను చెప్పకపోయిన లోలోన మాత్రం ఈ ప్రతిపాదనను ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తూ చాపకిందనీరులా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఇంతకాలం తాము ఆయా గ్రామాలపై అజమాయిషీ (పెత్తనం) చెలాయించాం.. ఇక మున్సిపాలిటీ అయితే తమ పరిస్థితి ఏంటని వారు మదనపడుతున్నట్లు సమాచారం. ఆరునూరైనా మున్సిపాలిటీ ఏర్పాటును ఆదిలోనే అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అదే జరిగితే మరో మండలం కూడా..

ఇదిలా ఉండగా ఇప్పుడున్న రూరల్ మండలం నుంచి ఈ 10 గానీ 12 గ్రామాలు గానీ విడిపోయి మున్సిపాలిటీలో కలిపితే ఇక రూరల్ మండలం అనే మాట వినబడదు. ఇప్పటికే రూరల్ మండలాన్ని రెండుగా విడగొట్టి ఎం.వెంకటాయపాలెం కేంద్రంగా మరో మండలాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నాళ్లుగానే ఉంది. ఇందుకోసం వివిధ రాజకీయ పక్షాలు ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు సైతం చేశారు. ఇప్పుడు 31 గ్రామపంచాయతీల్లో 10 నుంచి 12 జీపీలతో మున్సిపాలిటీ ఏర్పాటైతే మిగతా గ్రామ పంచాయతీలతో కొత్త మండలం ఏర్పాటు ఖాయమేనని తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీ, కొత్త మండలం ఏర్పాటు అనేది ఇప్పుడే చేస్తారా? కొన్నాళ్లు ఆగుతారా.. ఇంతలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు వస్తే ఎలా అన్న ప్రశ్నలకు సమాధానం తెలియాల్సి ఉంది.

వివరాలు అడిగిన మాట వాస్తవమే..

పెదతండాతో పాటు మరో తొమ్మిది నుంచి 11 గ్రామాలకు సంబంధించిన సమగ్ర డేటాను ఉన్నతాధికారులు అడిగిన మాట వాస్తవమే. దీంతో వారు అడిగిన పూర్తి డేటాను ఉన్నతాధికారులకు పంపించాం. అయితే ఏఏ గ్రామాలను పరిగణనలోకి తీసుకుంటారో, మున్సిపాల్టీగా చేస్తారో లేదో అనే విషయం మాత్రం తెలియదు.

-కుమార్, ఎంపీడీఓ, ఖమ్మం రూరల్ మండలం

ఘనంగా కృష్ణాష్టమి



ఖమ్మంలోని మురళీకృష్ణ మందిరంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణల్లో ఆకట్టుకున్నారు. విద్యాసంస్థలు, పలు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, ఉట్టికొట్టే కార్యక్రమాలు, కోలాటాలు, దాండియా నృత్యాలు కనుల పండువగా కొనసాగాయి. ఈ సందర్భంగా అసలు కృష్ణాష్టమిని ఎందుకు జరుపుకోవాలని, ఈ రోజుకు ఉన్న ప్రాశస్త్యం ఏమిటనే విషయాలు పలువురు వక్తలు అభివర్ణించారు.

-సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెంలో..



నేలకొండపల్లిలో..



ఖమ్మం మోతీనగర్‌లో..



ఎన్నెస్పీ క్యాంప్‌లో..



ఖమ్మంలోని మురళీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



వీవీపాలెంలో ఉట్ల వేడుకను ప్రారంభిస్తున్న దృశ్యం



నగరంలోని విద్యాక్షేత్ర పాఠశాలలో..



ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో..

సమస్యలు చెప్పండి పరిష్కరిస్తా..



ఆర్థిక సాయం అందిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన మంత్రి పొంగులేటి

కూసుమంచి/ఖమ్మంఅర్బన్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన వివిధ గ్రామాల ప్రజలు, నాయకులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, వారు వెల్లడించిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. కూసుమంచిలో ఇటీవల ఓ సెల్ దుకాణం అగ్నిప్రమాదంలో కాలిపోగా యజమాని, దివ్యాంగుడైన రాంబాబుకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అదనపు కలెక్టర్ మధునూదన్‌నాయక్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ గణేశ్, తహసీల్దార్ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మంలోని వివిధ ప్రాంతాల్లో మృతి చెందిన వారి కుటుంబాలతో పాటు గాయపడిన వారిని మంత్రి పరామర్శించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం స్థలాన్ని విద్యుత్ ఏడీ కోక్యానాయక్ సోమవారం పరిశీలించారు. మండలంలోని ఆరెగూడెం, ఆచార్లగూడెం, కోరట్లగూడెం, బోదులబండ, కోనాయిగూడెం గ్రామాల్లో అంతరాయం లేకుండా విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశామని అధికారులు తెలిపారు. ఎకరం స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నేలకొండపల్లి తహసీల్దార్ ఇమ్రాన్ స్థలాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరపురం ఏఈ నారాయణరావు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పలువురిపై అట్రాసిటీ కేసుతో పాటు దాడి కేసు నమోదైంది. సీఐ రమేశ్ కథనం ప్రకారం .. ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన నలగట్ల నందిని సోదరుడు బరపట్ల గణేశ్ డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వివాహితతో చాటింగ్ చేస్తుండగా ఆమె కుటుంబ సభ్యులు నాలుగు రోజుల కిందట హెచ్చరించారు. తిరిగి ఈ అంశంపై మాట్లాడేందుకు నయాబజార్ పాఠశాల వద్దకు రావాలని సూచించగా సోమవారం గణేశ్, ఆయన అక్క, తల్లి వెళ్లారు. అక్కడ వివాహిత భర్తతో పాటు మరికొందరు కలిసి కులం పేరుతో దూషిస్తూ గణేశ్, ఆయన తల్లి, సోదరిపై కర్రలు, బీరు సీసాలతో దాడి చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్ తెలిపారు.

వచ్చేనెల 8న పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సెప్టెంబర్ (వచ్చే నెల) 8వ తేదీన ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పూర్వ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఆనంద్‌కుమార్ తెలిపారు. సోమవారం వీడీఓస్ కాలనీలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 8న కళాశాల భూ విరాళం దాత గెంటేల నారాయణరావు 65వ వర్ధంతి సందర్భంగా రెండు పుస్తకాల ఆవిష్కరణ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉంటుందని చెప్పారు. ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాలలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేసిన వారిని విశిష్ట అతిథులుగా ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో మణిభూషనాచారి, సయ్యద్ ఇస్మాయిల్, షౌకత్ అలీ, కత్తి నెహ్రూ, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, పూడుగు వెంకటేశ్వరరావు, నాళ్ల భానుచందర్, ఆలేటి శ్రీనివాస్, కట్టికోల చిననర్సయ్య పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి



ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: పండ్లు పంపిణీ చేస్తున్న సంజీవరావు తదితరులు



ఖమ్మంమయూరిసెంటర్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మందా సంజీవరావు ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సోమవారం కేక్ కట్ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్ని, డేవిడ్, రవికిరణ్, నందిపాటి అభిషేక్, పసలపూడి రమేశ్, బండారు ప్రభాకర్, వి.ఇమ్మాన్యుయేలు, రాధాకృష్ణ, డి.కల్యాణి, నల్లగట్ల రమేశ్, కారుమంచి రాజేశ్, కోట, రాజు, మంద రాము, మంద సురేందర్, మంద నరేశ్, అంగడాల అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల నివాళులు

ఖమ్మంమయూరిసెంటర్: మదర్ థెరిసా జయంతి సందర్భంగా బీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన ఆస్పత్రి వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పగడాల నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నెమలి కిశోర్, మాతంగి అనిల్‌కుమార్, షకీనా, సిద్ధా సాహెబ్, ఉస్మాన్, ఆరెంపుల వీరభద్రం, ఎడవెల్లి భిక్షం, కాంపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం నగరంలోని బోనకల్ రోడ్‌లో ఉన్న దుర్గాభవాని వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ముందుగా మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరామ్, పూర్ణచందర్‌రావు, దుర్గా నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, వి.వెంకయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిని పర్మనెంట్ చేయండి..



ఖమ్మంఅర్బన్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం


ఖమ్మంఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా 475 కేజీబీవీల్లో పనిచేస్తున్న సుమారు 7,000 మందిని పర్మనెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని వెలుగుమట్ల గుట్టపై ఉన్న ఖమ్మంఅర్బన్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జరిగిన సదస్సుల్లో పాల్గొని ప్రసంగించారు. చాలా ఏళ్లుగా కట్టు బానిసలుగా కేజీబీవీలో నాన్ టీచింగ్ వర్కర్లు, సిబ్బందిని పనిచేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారిని ఇప్పటికైనా పర్మనెంట్ చేయాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 30న హైదరాబాద్‌లోని ఎస్పీడీ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో వర్కర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జ్యోతి, కోటి లింగం, కరుణ, శ్రీకాంత్, సరిత, కరుణకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నాయుడుపేటలోని కేజీబీవీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లేశ్వరి, చంద్రకళ, విజయ, సంధ్య, రమ్య, కళావతి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: అధిక ఫీజుల వసూళ్లతో విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న విద్యాసంస్థల అవినీతిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ డిమాండ్ చేశారు. గుర్తింపును రద్దు చేయాలనే డిమాండ్‌తో ఖమ్మంలోని ఓ విద్యాసంస్థ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. ఆంధ్రా కార్పొరేట్ విద్యాసంస్థల బ్రాంచ్‌లను ఇక్కడ అనుమతి లేకుండా ఏర్పాటు చేశారని తెలిపారు. ఇకనైనా అనుమతి లేని విద్యాసంస్థలను మూసివేయించి ఫీజుల నియంత్రణ, విద్యాహక్కు చట్టం అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళనకు దిగిన పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాయకులు సాగర్, రామకృష్ణ, గోపి, అజయ్, వినోద్, అనూష తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహదినంగా పాటించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మంసహకారనగర్: నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యోగ జేఏసీ పిలుపునిచ్చింది. సోమవారం నగరంలోని టీఎన్జీఓస్ ఫంక్షన్‌హాల్లో టీఎన్‌జీఓస్, టీజీఓస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, సెర్ప్, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నూతన పెన్షన్ విధానం ఉద్యోగులకు భవిష్యత్ లేకుండా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొణిదన శ్రీనివాస్, జైపాల్, శ్రీధర్‌సింగ్, గుంటుపల్లి శ్రీనివాస్, తాళ్లూరి శ్రీకాంత్, పి.రాజారావు, సగ్గుర్తి ప్రకాష్‌రావు, యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, నాగమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఏవీ నాగేశ్వరరావు, బిక్కు, రమణ, వెంకటేశ్వర్లు, వేణు, మల్సూర్ పాల్గొన్నారు.